# అసాధారణం

సరిగ్గా మూడున్నరకి బయల్దేరుతుంది మెట్‌పల్లి వెళ్ళే బస్. ఆ బస్‌లో కరీంనగర్ దాకా రిజర్వ్ చేయించుకున్నాను-వరుసగా నాలుగు రోజులు శెలవలు వచ్చాయి కాబట్టి ఇంటికి వెళ్ళాలని. ఆఫీస్‌లో పర్మిషన్ తీసుకొని రెండున్నరకల్లా లక్‌డీకాపూల్ బస్‌స్టాప్‌లో నిలబడ్డాను, బస్ డిపోకి వెళ్ళే బస్‌కోసం.

హైద్రాబాద్‌లోని రోడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌లోని ఓ ప్రత్యేకత-అవసరమయిన బస్ తప్ప మిగతా బస్‌లన్నీ వస్తాయి. సికింద్రాబాద్ స్టేషన్ వైపు, ఆర్. టి. సి. క్రాస్ రోడ్స్ వైపు వెళ్ళే బస్‌లు వస్తున్నాయి. కాని బస్ డిపోమీదుగా చార్మినార్ వెళ్ళే బస్సులు అరగంటయినా రావటంలేదు.

నే వెళ్ళాల్సిన బస్ టైం అయిపోతోంది. కోక్ రూంలో పెట్టాను నా బ్రీఫ్‌కేస్‌ని. దాన్ని కూడా తీసుకోవాలి బస్ ఎక్కేముందు.

డబల్‌డెకర్ ఒకటి వచ్చింది మెహిదీపట్నం నుంచి. చార్‌మినార్ వెళ్ళే బస్ అది. బస్ పూర్తి క్రిక్కిరిసి వుంది. ఆపలేదా బస్. హైద్రాబాద్‌లోని ఇంకో ప్రత్యేకత - కెపాసిటీకి మించిన ప్రయాణీకులతో బస్సులని నడపటం. బస్సులు తక్కువ, ప్రయాణీకులు ఎక్కువ.

చేతిగడియారం వంక చూసుకున్నాను.

మూడు అయింది.

ఇందాకటినుంచి నాలాగే బస్‌కోసం ఆత్రంగా చూస్తున్న ఒక ముసలాయన వంక చూసాను. ఆయనకి అరవైపైనే వుంటాయి. తెల్లటి జుట్టు,

నల్లటి ఫ్రేమ్‌గల కళ్ళజోడూ, పెరిగిన తెల్లటి గడ్డం. తెల్ల పేంట్ మీద తెల్ల షర్ట్ టక్ చేసుకున్నాడు.

"మీరు ఎందాక ?" అడిగాను.

నే నడిగిన ప్రశ్న అతనికి అర్థం కానట్లుగా చూసాడు నా వంక.

ఇంగ్లీష్‌లో అడిగాను ఈసారి.

"కోటీ." చెప్పాడు.

"ఆటోలో వెళదామా ? నేను కొంచెం తొందరగా వెళ్ళాలి. ఆటో ఫేర్ చెరిసగం షేర్ చేద్దాం." చెప్పాను ఇంగ్లీష్‌లో.

కొన్ని క్షణాలు నావంక తేరిపార చూశాడు.

"వెళ్దామా ?" అడిగాను.

తల వూపాడు.

ప్రక్కనే ఆగివున్న ఆటో ఎక్కాం ఇద్దరం.

"ఎల్. ఐ. సి. లో పనిచేస్తున్నాను." చెప్పాడతను కొద్దిసేపాగి.

నేను-నా పేరు, ఎక్కడ పనిచేసేది చెప్తుంటే వినకుండా అడిగాడు.

"ఆటోని ఎవరు కనిపెట్టారు ?"

"నాకు తెలీదు." కొద్దిగా ఆశ్చర్యంగా సమాధానం చెప్పాను. ఆయన ప్రశ్న వింతగా తోచింది నాకు.

"గాంధీగారికి ఖద్దరు కట్టుకోమని సలహా నేను యిచ్చాను. ఆ సలహా ఇవ్వకపోతే, నేనే కట్టుకుంటే నేను గాంధీ అయివుండేవాడిని."

చిన్నగా నవ్వాను.

"సికింద్రాబాద్ రైల్వే డివిజన్ జనరల్ మేనేజర్ నా అల్లుడు. చాలా గట్టివాడు. అసలు రైల్వేలో చేరాల్సింది నేను ఎల్. ఐ. సి. లో చేరాను."

"మీరు రిటైర్ అవలేదా ఇంకా ?" అడిగాను.

"నాకు డెబ్బైనాలుగేళ్ళు. అయినా ఇంకా కాలేదు. అవుతానంటే మా జి. ఎమ్. వద్దంటూ టెలెక్స్ పంపుతాడు. రిలీవ్ చేయటంలేదు."

"మంచిదేగా" నవ్వాను.

"అసలు చంద్రుడిమీద మొదట నేనే కాలు పెట్టాల్సింది. ఆర్మ్ స్ట్రాంగ్ కొట్టేసాడా ఛాన్స్.

నాలో చిన్న అనుమానం తలెత్తింది.

"అంటే ?" అడిగాను చిరాకుగా.

"నా కిదివరకు కట్టెలడితీ వుండేది. రైల్వే కంపార్టుమెంట్స్ తయారీకోసం అమ్మితే దాంతో రైల్వే ఇంజన్లుచేసి, నాకు బాకీపడి తీర్చలేదు. దివాలా తీసాను."

"మీరుండేది ఎక్కడ ?"

"సూర్యుడు మండుతాడు. కాని పొగ రాదేం ?" అడిగాడు నన్ను అకస్మాత్తుగా, సీరియస్‌గా.

"నాకు తెలీదు" చెప్పాను.

"పొగ వస్తుంది కాని ఎప్పుడోకాని అదిరాదు. వస్తే వర్షం వస్తుంది. నల్లని పొగలు వస్తాయి."

ఆయన మొహంవంక పరీక్షగా చూసాను. నుదుట గంధం చుక్క, దానిమీద ఎర్రటి కుంకుం బొట్టు, గొంతుమీద విభూది రేఖలు.

"మీరుండేది ఎక్కడ ?" అడిగాడు.

"జేమ్స్ స్ట్రీట్."

"మరి కోటీ ఎందుకు వస్తున్నారు ?"

నా చేతిని పట్టుకుని చిన్నగా నవ్వి అడిగాడు-

"నిముషాలు ఎక్కువా? లేక గంటలు ఎక్కువా ?"

"గంటలు."

"మరి చేతి గడియారంలోని నిముషాల ముల్లు పెద్దదిగా వుండీ, గంటల ముల్లు చిన్నగా వుందేం ?"

"నా చేతిగడియారం వంక చూసుకున్నాను. ఆయన చెప్పింది నిజమే. నాకేం సమాధానం చెప్పాలో తెలియలేదు.

"మీరు కోటీ ఎందుకెళ్తున్నారు ?" అడిగాను.

"మీరు రమ్మన్నారుగా ?" నవ్వాడు పగలబడి.

ఆటో అబిడ్స్ దాటి కోటీవైపు వెళుతుంది, బేంక్ స్ట్రీట్‌లో.

ఆయన నిశ్శబ్దంగా వుండిపోయాడు అకస్మాత్తుగా నా చెయ్యి వది లేసి. ఆయన వంక చూస్తూండిపోయాను. ఏదో ఆలోచిస్తున్నాడాయన.

కోటీ రాగానే ఆటోని కామత్ హోటల్ ఎదురుగా ఆపమని డ్రయి వర్‌కి చెప్పి అడిగాను ఆయన్ని-

"కోటీ వచ్చింది. దిగుతారా ?"

నా ప్రశ్న వినబడనట్లే కూర్చున్నాడాయన.

"రెండూ పది అయింది. సగం ఫేర్ ఇలా ఇవ్వండి." మళ్ళీ గట్టిగా చెప్పాను ఆ ముసలాయనతో.

జేబులోంచి పర్స్ తీసి ఒక ఐదురూపాయల కాగితం బయటికి తీసాడు. నాకు చూపించి అడిగాడు-

"ఎంత ?"

"రూపాయి."

"ఇవ్వను. నా ప్రశ్నలలో ఒక్క దానికి కూడా నువ్వు సమాధానం చెప్పలేదు. ఎందుకివ్వాలి."

డబ్బు జేబులో వుంచుకొని గట్టిగా అరుస్తూ నా చేతిని పట్టు కున్నాడు. ఆటో డ్రయివర్ వెనక్కి తిరిగి చూసాడు. కొద్దిగా ఇబ్బందిగా మా ఇద్దరి వంకా.

"దిగండి" అన్నాను కోపం దిగమింగుకుంటూ.

"సమాధానం తెలియనప్పుడు నా చేత ఎందుకడిగించావ్ ఆ ప్రశ్నలు" అడిగాడు కోపంగా మళ్ళీ.

తర్వాత చరచరా దిగి జనంలో కలిసిపోయాడు క్షణాలలో.

"బస్ డిపోకి పోనీ."

చెప్పాను డ్రయివర్‌తో విసుగ్గా.

*    *    *

నాకు పెళ్ళి చేయాలన్న తొందర మా అమ్మా, నాన్నలకి లేక పోయినా ఎదిగిన ఆడపిల్లలు గల తల్లితండ్రులు అనేకమంది నా గురించి అడగటంతో వాళ్ళకి తోచినట్లుంది.

ఉత్తరం వ్రాసారు నాకు.

ఒకరిద్దరు నా ఆఫీస్‌కి వచ్చి, మీ వాళ్ళతో మాట్లాడామని, పిల్లని చూడటానికి వాళ్ళిళ్ళకు పిలిచారు.

ఓ ఆదివారం ఓ అమ్మాయిని చూడటానికి వెళ్ళాను, మా అక్క లిద్దరినీ తీసుకుని.

"ఈయన పిల్ల తాతగారు."

పరిచయం చేసారు ఆయన్ని, సుల్తాన్ బజార్ ప్రాంతంలోని ఓ ఇంట్లో.

కొద్దిగా తెల్లబోతూ చూసా ఆయన వంక.

ఆయనే!

తెల్లటి జుట్టు: నల్లటి ఫ్రేమ్ కళ్ళజోడు: తెల్లటి గడ్డం: నుదుట గంధపు బొట్టు మీద ఎర్రటి కుంకం బొట్టు ....

"నమస్తే" అన్నాను చేతులు జోడించి.

ఆయన నా వంక చూసాడు కొన్ని క్షణాలు. ప్రశాంతంగా వుంది ఆయన చూపు.

అమ్మాయి బావుంది. ఆయన పోలికలున్నాయి. వయసు స్వీట్ సిక్స్‌టీన్ ప్లస్ టూ.

ఇంటికి వెళ్ళాక చెప్పింది అక్కయ్య-

"పిల్ల చాలా బావుందిరా."

"కాని వాళ్ళ వంశంలో పిచ్చి వుంది." చెప్పాను.

"పిచ్చా? నీ కెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగారు ఇద్దరు అక్కయ్యలు.

పెళ్ళికూతురు తాత నాకు కనబడి నప్పటి సంగతి పూర్తిగా చెప్పాను.

కాసేపు వాళ్ళిద్దరూ మాట్లాడలేదు.

"అయితే పిచ్చి వంశపారంపర్యంగా వస్తుందంటావా?" అడిగింది రెండో అక్కయ్య.

"నాకు తెలిసినంతవరకు పిచ్చి, బొల్లి వస్తుంది."

"పిల్లయితే బాగానే వుంది."

"అయితే మాత్రం? అమ్మ, నాన్నలకి చెప్తే సరి. వాళ్ళు చూసు కుంటారు ఏం చేయాలో" అన్నది పెద్దక్క.

ఆ రోజు సాయంత్రం నా గదికి వచ్చాడాయన.

పెళ్ళికూతురు తాత!

"రండి."

మడిచి వున్న కుర్చీని వాల్చాను. దాంట్లో కూర్చుని ఆయన ఓసారి గట్టిగా నిట్టూర్చాడు. తర్వాత నా గదిని పరిశీలనగా చూసాడు. ఆ తర్వాత నా వంక చూసాడు.

"ఎలా వుంది నా మనమరాలు?" అడిగాడు నా కళ్ళలోకి సూటిగా చూస్తూ.

నేను చూపులు తిప్పుకుని చెప్పాను-

"బావుంది."

"ఆ రోజు సంఘటన ఇంకా గుర్తుందా ?" అడిగాడు.

"ఆటోలోనా ?"

"అవును. నాకు పిచ్చి అనుకున్నావు కదూ ?"

చిన్నగా నవ్వి తల వూపాను.

"ఆ సంగతి మర్చిపోవాలి బాబూ నువ్వు. నా మనమరాలి పెళ్ళికి అదీ అడ్డురాకూడదు" అన్నాడు వేడికోలుగా.

ఏం చెప్పాలో తెలియలేదు నాకు.

"సారీ. ఆ రోజు కావాలనే అలా ప్రవర్తించాను నీతో. నిజానికి నాకు పిచ్చి లేదు. ఆటో ఫేర్ ఇవ్వవల్సి వస్తుందని...."

అంత పెద్దాయన నా ముందు తల వంచుకొనటం నాకు బాధవేసింది.

"....మా పెద్దబ్బాయి దగ్గరుంటున్నాను వాడు నాకు అట్టే డబ్బివ్వడు. నా ఖర్చులు నాకుంటాయి కదా, వచ్చే పెన్షన్ చాలదు...."

"ఫర్వాలేదండి" అన్నాను.

"ప్లీజ్, డోంట్ లెట్ దట్ ఇన్సిడెంట్ బి ఏ హిండరెన్స్ టు ది ఎలియన్స్."

రెండు నిమిషాల తర్వాత ఆయన వెళ్ళిపోయాడు- మరోసారి క్షమాపణ చెప్పుకుని. నా కెంతో ఆశ్చర్యం వేసింది జరిగింది తలుచుకుంటే.

పనిమనిషి మర్నాడు ఉదయం గది వూడుస్తుంటే కుర్చీ ప్రక్కన దొరికిందని ఒక రూపాయి కాగితం, ఒక అయిదు పైసల బిళ్ళ అందించింది నాకు. (నీలిమ మార్చి 1978)